


నులిపురుగు నిర్మూలనను నూరుశాతం పూర్తి చేయాలి

పాలకోడేరు : జాతీయ నులిపురుగు నిర్మూలనా కార్యక్రమం నూరుశాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం శృంగవృక్షం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులి పురుగు నిర్మూలనా కార్యక్రమాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలను ఎంత మంది పిల్లలకు ఇచ్చారు, ఇచ్చిన వారు ఏ విధంగా వేసుకున్నారు, ఇంకా ఎంత మందికి ఇవ్వాలని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1 నుండి 19 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన విద్యార్థులకు డీవార్మింగ్ టాబ్లెట్స్ అందజేయానికి పక్కా ఏర్పాట్లు చేశామన్నారు. అన్ని పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ ద్వారా 1 నుండి 19 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన ప్రతి ఒక్కరికీ ఆల్బెండజోల్ టాబ్లెట్స్ వేయడం ప్రతి చోట జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టరు వెంట డిఎంహెచ్ఒ డి.మహేశ్వరరావు, డిఇఒ ఆర్.వెంకటరమణ, ప్రధానోపాధ్యాయులు టికె జగన్నాథరావు తదితరులు ఉన్నారు.

జగనన్న.. పద్దు పలికేనా..!

ఈ నెల 16న అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న 2023-24 బడ్జెట్‌పై జిల్లావాసులు గంపెడాశలు పెట్టుకున్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక జిల్లాలోని అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రతి బడ్జెట్‌లోనూ సరిపడా నిధులు కేటాయించకపోవడం, కేటాయించిన నిధులు ఖర్చు చేయకపోవడం వంటి పరిస్థితి కొనసాగింది. దీంతో సాగునీటి ప్రాజెక్టులు చింతలపూడి, తాడిపూడితోపాటు డెల్టా ఆధునికీకరణ పనులు, ఆక్వా యూనివర్శిటీ, ఫిహార్బర్, పోలవరం నిర్వాసితులకు ఇచ్చిన హామీలు ఇలా ఏ ఒక్కటీ ఇప్పటికీ నెరవేరలేదు. వైసిపి ప్రభుత్వం తన పాలనా కాలంలో ప్రవేశపెట్టే పూర్తిస్థాయి బడ్జెట్ ఇదే. ఈసారైనా జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయిస్తారా అనే చర్చ జిల్లావాసుల్లో సాగుతోంది.



ముందుకు సాగని చింతలపూడి, తాడిపూడి ప్రాజెక్టు పనులు
పడకేసిన డెల్టా ఆధునికీకరణ
ఆక్వా యూనివర్సిటీ, ఫిషింగ్ హార్బర్ పనులూ అంతే
కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణం ప్రకటనలకే పరిమితం
పోలవరం నిర్వాసితుల హామీలకు నిధులిచ్చేనా?
దగ్గులూరు మెడికల్ కాలేజీ కాగితాల్లోనే
16న అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోని అత్యంత ముఖ్యమైనవిగా చింతలపూడి, తాడిపూడి ఎత్తిపోతల ప్రాజెక్టులు ఉన్నాయి. చింతలపూడి ప్రాజెక్టు పూర్తయితే 4.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. తాడిపూడి ఎత్తిపోతల పథకానికి సంబంధించి పిల్ల కాలువల తవ్వకాలు జరిగితే 2.60 లక్షల ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందనుంది. అయితే ఈ ప్రాజెక్టులు దశాబ్దాలు గడిచినా పూర్తికాని పరిస్థితి నెలకొంది. దీంతో అంచనా విలువ పెరిగిపోతుండటంతో ఈ ప్రాజెక్టులు పూర్తయ్యేనా అనే అనుమానం జిల్లావాసుల్లో నెలకొంది. 2008లో చింతలపూడి పాజెక్టును రూ.1,701 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించారు. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టును కృష్ణా జిల్లాకు విస్తరించింది. మొత్తం 4.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రణాళికలు రూపొందించింది. రూ.4,909.80 కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనాలు రూపొందించారు. ఇప్పటికీ భూసేకరణ ప్రక్రియ పూర్తి కాలేదు. 2022-23కు సంబంధించిన బిల్లులు ఇంకా రూ.149 కోట్లు వరకూ పెండింగ్ ఉన్నట్లు తెలుస్తోంది. గడిచిన బడ్జెట్‌లో రూ.221 కోట్లు కేటాయించినట్లు చూపినా ఖర్చు చేయలేదని లెక్కలు చెబుతున్నాయి. ఇప్పుడు ఈ ప్రాజెక్టు ఖర్చు అంచనా వ్యయం రూ.9,800 కోట్లుకు చేరింది. ఈ ప్రాజెక్టు పనులు 62 శాతం పూర్తయినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇప్పటి వరకూ దాదాపు రూ.నాలుగు వేల కోట్లు వరకూ ఖర్చు పెట్టారు. ఈ ఏడాది మెయిన్ కెనాల్ కాలువ పనులు 106 కిలోమీటర్ల మేర పూర్తి కావాలంటే రూ.1500 కోట్లు బడ్జెట్‌లో కేటాయించాల్సి ఉంది. ఈ బడ్జెట్‌లోనైనా చింతలపూడికి నిధులు కేటాయిస్తారా అనే చర్చ రైతుల్లో సాగుతోంది. తాడిపూడి ఎత్తిపోతల పథకానికి 2004లో అంకురార్పరణ జరిగింది. ఇప్పటికీ పూర్తిస్థాయిలో సాగునీరు అందని దుస్థితి నెలకొంది. ఈ ప్రాజెక్టు నుంచి పూర్తిస్థాయిలో నీరందిస్తే 2.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.88.53 కోట్లు. ఇప్పటి వరకూ దాదాపు రూ.600 కోట్లు వరకూ ఖర్చు చేశారు. పిల్ల కాలువ తవ్వకం పూర్తయితే సాగునీరు పూర్తిస్థాయిలో అందుతుంది. గత బడ్జెట్‌లో రూ.పది కోట్లు కేటాయించినట్లు చూపారు. ఈ బడ్జెట్‌లో పూర్తిస్థాయిలో నిధులు కేటాయిస్తే పనులు పూర్తయ్యే అవకాశం ఉంటుంది. కొవ్వాడ, ఎర్రకాలువ రిజర్వాయర్, తమ్మిలేరు రిజర్వాయర్ పనులకు సంబంధించి సైతం నిధుల కేటాయింపు లేకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా పరిస్థితి తయారైంది. గత బడ్జెట్‌లో ఈ పనులన్నింటికీ గంపగుత్తగా రూ.68 కోట్లు కేటాయించినట్లు మాత్రం ప్రకటించి మమ అన్పించారు.

పడకేసిన డెల్టా ఆధునికీకరణ పనులు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఖరీఫ్‌లో, రబీలో కలిపి పది లక్షల ఎకరాల్లో వరి సాగు ఉంది. ఎక్కడికక్కడే కాలువలు మెరకదేరిపోవడంతోపాటు లాకుల కట్టడాలన్నీ బ్రిటీష్ కాలంలో నిర్మించినవి కావడంతో శిథిలావస్థకు చేరాయి. చిన్నపాటి వర్షాలకు సైతం రైతులు పెద్దఎత్తున పంట నష్టపోతున్నారు. 2007లో జిల్లాలో డెల్టా ఆధునికీకరణ నిమిత్తం రూ.1416 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకూ దాదాపు రూ.800 కోట్లు పనులు పూర్తయ్యాయి. ఇంకా రూ.600 కోట్ల పనుల వరకూ జరగాల్సి ఉంది. గడిచిన మూడేళ్లుగా ఆధునికీకరణ పనులకు సంబంధించి అధికారులు ప్రణాళికలు పంపించడమే తప్ప ప్రభుత్వం నుంచి ఆమోదం మాత్రం రావడం లేదు. ఈ ఏడాది సైతం ఇప్పటి వరకూ ఆధునికీకరణ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ సైతం జరగలేదు. గత బడ్జెట్‌లో కేవలం రూ.పది కోట్లు కేటాయించినట్లు చూపారు. ఈ ఏడాదైనా బడ్జెట్‌లో ఆధునికీకరణకు నిధులు కేటాయిస్తారో.. లేదో చూడాలి.

ముందుకు సాగని ఫిషింగ్ హార్బర్, ఆక్వా యూనివర్శిటీ, కొల్లేరు రెగ్యులేటర్ నిర్మాణ పనులు

నరసాపురం మండలం బియ్యపుతిప్పలో ఫిషింగ్ హార్బర్, వేములదీవిలో ఆక్వా యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. వీటి నిర్మాణాలకు రూ.300 చొప్పున కేటాయించనున్నట్లు తెలిపింది. ఇప్పటి వరకూ పనులు పెద్దగా ముందుకు సాగిన పరిస్థితి లేదు. అభివృద్ధి పనులు ముందుకు సాగకపోవడంతో జిల్లా ప్రజానీకంలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. సముద్రపు నీరు కొల్లేరులోకి ప్రవేశించకుండా ఉప్పుటేరుపై దుంపగడప, పడితడక, మొల్లపర్రు వద్ద మూడు రెగ్యులేటర్లు నిర్మించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అందుకు రూ.412 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. అయితే పనులు ప్రారంభం కాలేదు. ఈ బడ్జెట్‌లోనైనా రెగ్యులేటర్ల నిర్మాణం ప్రస్తావన ఉంటుందో.. లేదోనన్న అనుమానాలు నెలకొన్నాయి.

కాగితాల్లోనే దగ్గులూరులో మెడికల్ కాలేజీ

పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయనున్నట్లు 2019లో ప్రభుత్వం ప్రకటించింది. ఆ తర్వాత జిల్లాల విభజన కూడా పూర్తయ్యింది. ఏలూరు మెడికల్ కాలేజీ పనులు కొంతమేర సాగుతుండగా, విభజిత జిల్లా పశ్చిమగోదావరిలోని పాలకొల్లు సమీపంలోని దగ్గులూరులో ప్రకటించిన మెడికల్ కాలేజీ నిర్మాణం కాగితాలకే పరిమితమైంది. దగ్గులూరు మెడికల్ కాలేజీ కోసం సేకరించిన 60 ఎకరాల భూమికి ఇప్పటికీ పూర్తిస్థాయిలో సొమ్ము ఇవ్వని దుస్థితి నెలకొంది. ఈ బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయిస్తారో.. లేదో వేచిచూడాలి.

నిర్వాసితులకిచ్చిన హామీల అమలుకు నిధులొచ్చేనా?

పోలవరం నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ కింద రూ.పది లక్షలు, 2006కు ముందు సేకరించిన భూములకు ఎకరాకు రూ.ఐదు లక్షలు పరిహారం ఇస్తామని గత ఎన్నికల్లో వైసిపి ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ఏఒక్క హామీ నెరవేర్చలేదు. నిర్వాసితులకిచ్చిన హామీలు గుర్తున్నాయంటూ చెప్పడం మినహా కార్యాచరణకు నోచని పరిస్థితి ఉంది. 2022 జులై, ఆగస్టుల్లో విరుచుకుపడిన గోదావరి వరదలకు పోలవరం నిర్వాసితులు గ్రామాలను వదిలి నెలలు తరబడి పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్నారు. 41.15 కాంటూరు వరకూ ఉన్న గ్రామాలకు ప్యాకేజీ పూర్తిస్థాయిలో చెల్లించి ఖాళీ చేయిస్తామని ప్రభుత్వం తెలిపింది. ఇప్పటికీ పూర్తికాని పరిస్థితి ఉంది. దీంతో పోలవరం ముంపుబారిన పడుతున్న 22,404 కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు అనేది లేకుండాపోయిన సంగతి తెలిసిందే.



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

ప్రశాంత వాతావరణంలో పరీక్షల నిర్వహణ
ఇంటర్‌కు 52, పదో తరగతికి 121 పరీక్షా కేంద్రాలు
ఇంటర్‌కు 35787 మంది, పదో తరగతికి 24586 మంది విద్యార్థులు
అధికారులతో సమీక్షలో జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ఇంటర్, పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఇంటర్, పదో తరగతి పరీక్షల నిర్వహణపై స్థానిక కలెక్టరేట్‌లో ఆమె అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఇంటర్, ఎస్ఎస్‌సి పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటర్ పరీక్షలు ఈ నెల 15 నుండి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరుగుతాయన్నారు. పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3 నుండి 18వ తేదీ వరకు నిర్వహిస్తారన్నారు. ఇంటర్ పరీక్ష ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఎస్-ఎస్‌సి పరీక్షలు ఉదయం 9.30 గంటల నుండి 11.45 గంటల వరకూ నిర్వహిస్తారని తెలిపారు. పరీక్షలకు నిర్ధారించిన సమయం మించి నిమిషం ఆలస్యంగా వస్తే పరీక్షకు అనుమతించబోరని స్పష్టం చేశారు. ఇన్విజిలేటర్లు, పరీక్షా కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది కూడా స్మార్ట్‌ఫోన్లను తీసుకురాకూడదని, కేవలం చీఫ్ ఇన్విజిలేటర్ వద్ద మాత్రమే ఫీచర్ ఫోన్‌ను అనుమతిస్తారని తెలిపారు. విద్యార్థినుల వద్ద సెల్‌ఫోన్లు తనిఖీ చేసేందుకు పరీక్షా కేంద్రాల వద్ద మహిళా పోలీసులను నియమించాలన్నారు. ఇంటర్ పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు జిల్లాస్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేసవి దృష్ట్యా పరీక్షా కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో వంద మీటర్ల పరిధిలో 144 సెక్షన్ విధిస్తారని, పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లు, ఇంటర్‌నెట్ సెంటర్లు పరీక్షల సమయంలో మూసివేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఇంటర్ పరీక్షలకు 52 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ చేశామని కలెక్టర్ ప్రశాంతి చెప్పారు. జిల్లాలో 52 ఇంటర్ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఫస్టియర్ పరీక్షలకు 18,352 మంది, సెకండియర్ పరీక్షలకు 17,435 మంది మొత్తం 35,787 మంది హాజరుకానున్నారని చెప్పారు. 52 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 52 మంది డిపార్టుమెంట్ ఆఫీసర్స్, 955 మంది ఇన్విజిలేటర్లు, ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేశామన్నారు.

పదో తరగతి పరీక్షలకు 121 కేంద్రాలు

పదో తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ చేశామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 24,586 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. 22 స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేశామని, 121 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్లు, 24 మంది రూట్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్ఒ కె.కృష్ణవేణి, ఎఎస్‌పి ఎవి.సుబ్బరాజు, డిఇఒ ఆర్.వెంకటరమణ, డిఐఇఒ కెవి.సత్యనారాయణ, అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సన్నద్ధం

ఆకివీడు : మండలంలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు కేంద్రాలు సిద్ధమయ్యాయి. మూడు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. విద్యా వికాస్, కార్తికేయ, దుంపగడప ఆంధ్రకేసరి ప్రకాశం శతజయంతి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాలలో పరీక్షలు నిర్వహించే మూడు కళాశాల విద్యార్థులతో పాటు స్థానిక వాసవి శారద జూనియర్ కళాశాల, ఇమ్మానుయేలు ఒకేషనల్ జూనియర్ కళాశాల, కాళ్ల మండలం జువ్వలపాలెం గ్రామంలో బాలజ్యోతి జూనియర్ కళాశాల కాళ్ల గ్రామంలోని జగన్ సాయి జూనియర్ కళాశాలకు చెందిన ఏడు కళాశాలల్లో సుమారు 1600 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 850 మంది జూనియర్ ఇంటర్, 750 మంది సీనియర్ ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. సుమారు 60 మంది ఇన్విజిలేటర్లతో పాటు ప్రత్యేక పరీక్షా నిర్వాహకులుగా డిపార్మెంటల్ ఆఫీసర్స్, చీఫ్ సూపరింటెండెంట్స్ నిర్వహిస్తున్నారు. ఆయా కళాశాల వద్ద 144 సెక్షన్ విధించినట్లు ఇప్పటికే అధికారులు ప్రకటించారు.

పాలకొల్లు: పట్టణంలోని 7 కేంద్రాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. దీనికి సంబంధించి అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పట్టణంలోని ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల, కోకోనట్ మర్చంట్స్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదిత్య జూనియర్ కళాశాల, కెవిఎం ఛాంబర్స్ జూనియర్ కళాశాల, గౌతమి జూనియర్ కళాశాల, శ్రీ చైతన్య జూనియర్, కళాశాల, సబిత జూనియర్ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయి. పట్టణంలో 2 వేల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులను, అధికారులను ఇన్విజిలేటర్లుగా నియమించారు.

చలో ఢిల్లీ జయప్రదానికి మోటారు సైకిల్ యాత్ర



వీరవాసరంలో ప్రారంభమైన మోటార్ సైకిల్ యాత్ర

ప్రజాశక్తి - వీరవాసరం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ ఐదో తేదిన నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జుత్తిగ నరసింహమూర్తి పిలుపునిచ్చారు. చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం స్థానికంగా మోటార్ సైకిల్ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ మోడీ అనుసరిస్తున్న విధానాలు కార్పొరేట్, పెట్టుబడిదారుల దోపిడీ వ్యవస్థకు అనుకూలంగా ఉన్నాయన్నారు. అంబానీ, అదానీల సేవలో మోడీ మునిగి తేలుతున్నారన్నారు. మతం పేరుతో ప్రజలను చీల్చడమే బిజెపి వైఖరిగా ఉందని విమర్శించారు. రైతు వ్యతిరేక విధానాలు అవలంబించడం వల్ల గత ఐదు సంవత్సరాల కాలంలో 28,572 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం దేశ ప్రతిష్టకే సిగ్గుచేటన్నారు. ఈ యాత్ర పెర్కిపాలెం, నందమూరుగరువు, దూసనపూడి, మత్స్యపురిపాలెం, బాలేపల్లి, మెంటేపూడి, తలతాడితిప్ప, వడ్డిగూడెం వరకు సాగింది. కార్యక్రమంలో పోతుల మృత్యుంజయ, బొబ్బనపల్లి సూర్యచంద్రరావు, యాళ్లబండి నారాయణమూర్తి, తాళ్లూరి రాము, గొట్టుముక్కల శ్యాంబాబు, రెడ్డి రామారావు పాల్గొన్నారు.

ఆచంట: ఏప్రిల్ 5న ఢిల్లీలో నిర్వహించనున్న కార్మిక, కర్షక పోరాట ప్రదర్శనను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం పిలుపునిచ్చారు. చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఎపి రైతుసంఘం, కౌలురైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి సిఐటియు మండల అధ్యక్షురాలు వైట్ల ఉషారాణి అధ్యక్షత వహించారు. ఈ సంధర్భంగా హరేరాం మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దాసిరెడ్డి కోటేశ్వరరావు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ, వివిధ సంఘాల నేతలు నిమ్మన వెంకట తాయారు, మట్టపర్తి నాగమణి, గుత్తుల శ్రీదేవి, దిద్దే ఝాన్సీ, చిలుకూరి వరలక్ష్మి, టి.ముత్యాలరావు, కేతా నాగాంజనేయులు, పి.శ్రీరాములు, ఎస్.సత్తిపండు పాల్గొన్నారు.

స్పందించిన జిల్లా అధికారులు

పాలకోడేరు పంచాయతీ కార్యదర్శిపై నివేదిక కోరిన కలెక్టర్
అధికారులకు వివరణిచ్చిన పంచాయతీ కార్యదర్శి రమాలీలా
కలెక్టర్‌కు నివేదిస్తాం: ఎంపిడిఒ మురళీగంగాధర్
ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - పాలకోడేరు

ఈ నెల 11న ప్రజాశక్తిలో ప్రచురితమైన 'ఆ పంచాయతీ కార్యదర్శి రూటే సపరేటు' కథనంపై జిల్లా అధికారులు స్పందించారు. పాలకోడేరు పంచాయతీ కార్యదర్శిపై నివేదిక ఇవ్వాలని ఆ శాఖ జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఎం.రాజేశ్వరి, సిహెచ్.శ్యామలరావు, నరేంద్ర వర్మ, పి.వెంకటేశ్వరరావు, సుబ్బరాజు, భాస్కర్‌రాజు పాలకోడేరులో సర్వేనెంబర్ 9/1, 9/2, 9/3, 10/1, 10/2, 1డి, 1ఇ, 2బిలోని స్థలంలో ఇళ్లు నిర్మించుకునేందుకు ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి సుమారు రూ.27 లక్షలు చెల్లించి అనుమతి తెచ్చుకున్నారు. అయితే ఇంటి నిర్మాణానికి పంచాయతీ కార్యదర్శి రమాలీల పంచాయతీ నుంచి అనుమతి ఇవ్వట్లేదని బాధితులు ప్రజాశక్తి దృష్టికి తీసుకొచ్చారు. అనుమతి కోసం ఎన్నిసార్లు అడిగినా నిర్లక్ష్యపు సమాధానం చెప్పడంతోపాటు అవమానకరంగా మాట్లాడుతున్నారని వాపోయారు. దీంతోపాటు గ్రామంలో పంచాయతీ కార్యదర్శి వ్యవహార శైలి కారణంగా జగనన్న లేఅవుట్‌కు వెళ్లే దారి మూసుకుపోయిన అంశాలతో ఈ నెల 11న ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కలెక్టర్ రమాలీలపై నివేదిక కోరారు. ఈ నెల 13న డివిజనల్ స్థాయి అభివృద్ధి అధికారులు పాలకోడేరు పంచాయతీకి వచ్చి కార్యదర్శి రమాలీలను విచారించి వివరాలు సేకరించారు. అలాగే మండల పరిషత్ అధికారులు రమాలీల నుంచి రాతపూర్వక వివరణ తీసుకున్నారు. ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి ఇంటి నిర్మాణానికి అనుమతి తెచ్చుకున్న వారికి పంచాయతీ తీర్మానంలో ఈ అంశాన్ని పెట్టి ఇంటి నిర్మాణానికి అనుమతి ఇస్తామని రాతపూర్వకంగా వివరణిచ్చినట్లు తెలిసింది. పంచాయతీ కార్యదర్శి సమర్పించిన వివరణ ఆధారంగా కలెక్టర్‌కు నివేదిక అందిస్తానని ఎంపిడిఒ మురళీగంగాధర్ తెలిపారు.



మార్క్స్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నాయకులు

మహోన్నత వ్యక్తి కారల్ మార్క్స్

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - భీమవరం

ప్రపంచాన్నే ప్రభావితం చేసిన మహోన్నత వ్యక్తి కారల్ మార్క్స్ అని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం కొనియాడారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలోని కారల్‌మార్క్స్ 140వ వర్ధంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బలరాం మాట్లాడుతూ ప్రపంచ మేధావి, ప్రపంచ ప్రముఖుల్లో కారల్ మార్క్స్ ఒకరని అన్నారు. మార్క్స్ వర్ధంతి రోజునే ప్రముఖ శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ జయంతి అని అని గుర్తు చేశారు. ఇరువురు ప్రపంచాన్ని ప్రభావితం చేసిన వారిలో ప్రధానమైన వారని అధ్యయనాల్లో రుజువైందన్నారు. ప్రపంచంలోని దోపిడీ నుండి పీడిత ప్రజానీకం విముక్తి కావాలని, దోపిడీరాజ్య స్థానంలో కార్మిక రాజ్యం, సోషలిజం రావాలని ఆకాంక్షించారన్నారు. తన ప్రియ మిత్రుడు, మరో ప్రపంచ మేధావి ఎంగెల్స్‌తో కలిసి ఎన్నో రచనలు చేశారన్నారు. ప్రపంచంలో పెట్టుబడిదారీ విధానం శాశ్వతం కాదని, దోపిడీ శాశ్వతం కాదని, దోపిడీ నుంచి కార్మికులు, పీడిత ప్రజలు తప్పని సరిగా విముక్తి పొందుతారని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండే సోషలిజం ఏర్పడుతుందని కలలు కని వీరు ఇరువురు కమ్యూనిస్టు ప్రణాళిక రచించారని అన్నారు. దీంతోపాటు పెట్టుబడి గ్రంథాన్ని రచించారని గుర్తు చేశారు. ఆ పెట్టుబడి గ్రంథంలోని అనేక అంశాలు నేడు ప్రపంచంలో ఆచరణలో కన్పిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు జె.సత్యనారాయణ, నాయకులు కె.క్రాంతిబాబు, ఎం.ఆంజనేయులు, అల్లూరి అరుణ్, బి.విజయ్, గంటి శ్రీను, జి.రఫాయేలు, కె.రత్నకుమారి పాల్గొన్నారు.

పోరాటాలతోనే ఉపాధి హామీ పరిరక్షణ : వ్యకాస



ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న చినవీరభద్రరావు

ప్రజాశక్తి - ఇరగవరం

ఉపాధి హామీ పరిరక్షణకు ఉధృత పోరాటాలే మార్గమని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు అన్నారు. మంగళవారం అర్జునుడుపాలెం గ్రామంలో పనిచేస్తున్న కూలీలతో ఆయన మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెండు పూటలా పని, మస్తరు విధానం చాలా కష్టంగా ఉందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రోజు కూలి రూ.257 ప్రస్తుతం పెరిగిన ధరలతో పోలిస్తే చాలా తక్కువ అని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ మండుటెండలో కష్టపడి పనిచేస్తున్న కూలీలకు కనీస వేతనం అమలు చేయకుండా వారి శ్రమను దోపిడీ చేయడం సిగ్గుచేటని విమర్శించారు. నేడు దేశంలో ఆర్థిక సంక్షోభం కొనసాగుతున్న స్థితిలో ఉపాధి హామీని మరింత విస్తరించి గ్రామీణ ప్రజలకు కొనుగోలు శక్తి పెంచే చర్యలు చేపట్టకపోగా నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనే కుట్రలకు పాల్పడి కూలీల పొట్ట కొడుతుందోని విమర్శించారు. పని ప్రదేశంలో కార్మికుడి ఫొటో తీయడం, మొబైల్ యాప్‌లో అప్లోడ్ చేయడం, ఆన్ లైన్ హాజరు తప్పనిసరి అనే కొత్త వ్యవస్థను తీసుకురావడం వల్ల పూర్తి సౌకర్యం లేని ఇంటర్నెట్ విధానంతో కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి రెండు పూటా పని రద్దుచేసి రోజు కూలి రూ.600 ఇవ్వాలని, ప్లే స్లిప్పులు ఇవ్వాలని, సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు, రైతు, కౌలు రైతు సంఘాల పిలుపులో భాగంగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కర్రి వీరరాఘవరెడ్డి, పాలకోడేటి వెంకటలక్ష్మి, జుత్తిగ లక్ష్మి. పాల విజయలక్ష్మి. జుత్తిగ దుర్గమ్మ, కుక్కల పార్వతి, జుత్తిగ సత్యవతి, పంపన అంజమ్మ పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలతోనైనా ఆక్రమణలు తొలగేనా..!

వీరవాసరం: స్థానిక ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు రాకపోకలకు ఇబ్బందికరంగా మారిన ఆక్రమణలు కలెక్టర్ ఆదేశాలతోనైనా తొలగేనా అనే చర్చ సర్వత్రా నడుస్తోంది. డి-వార్మింగ్ కార్యక్రమ పరిశీలనలో భాగంగా మంగళవారం కలెక్టర్ పి.ప్రశాంతి వీరవాసరం హైస్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ నేపథ్యంలో హైస్కూల్‌కు ఆనుకుని ఉన్న ఆక్రమణలు ఆమె దృష్టికి కొందరు తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కలెక్టర్ తక్షణం ఆ ఆక్రమణలు తొలగించాలని తహాశీల్దార్ సుందరాజును ఆదేశించారు. అయితే కొన్ని సంవత్సరాలుగా పలుసార్లు ఆక్రమణదారుల వల్ల విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను స్కూల్ యాజమాన్యం, విద్యాకమిటీ స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు శూన్యం. ఈ ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ స్థానిక అధికారులకు సూచించినా ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. తాజాగా ఆక్రమణలు తొలగించాలంటూ కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను అధికారులు పాటిస్తారో.. లేదో వేచి చూడాలి. హైస్కూల్ జాతీయ రహదారిని ఆనుకుని ఉండటం వల్ల స్కూల్ తెరిచే వేళ, మూసే వేళ విద్యార్థులు ఒకేసారి జాతీయ రహదారిపైకి రావడంతో ప్రమాదాలకు లోనవుతున్నారు. ఈ క్రమంలో ఇక్కడికొచ్చిన కలెక్టర్‌కు విద్యార్థుల ఇబ్బందులలు తెలియడంతో చర్యలు ఎలా ఉంటాయోనని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

భౌతికశాస్త్రంలో అగ్రగణ్యుడు ఐన్‌స్టీన్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భౌతికశాస్త్రంలో అగ్రగణ్యుడు ఐన్‌స్టీన్ అని డిఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ బి.శాంతకుమారి అన్నారు. మంగళవారం డిఎన్ఆర్ కళాశాల ఫిజిక్స్ శాఖ, జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్రపంచ ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్ స్టీన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతకుమారి మాట్లాడారు. ఆధునిక భౌతికశాస్త్రానికి మూలమైన రెండు సిద్ధాంతాల్లో ఒకటైన జెనరల్ థియరీ ఆఫ్ రిలెటివిటీని ప్రతిపాదించారన్నారు. [illegible] మాట్లాడుతూ ప్రతి కళాశాల, పాఠశాలలో ఐన్‌స్టీన్ మహోన్నత చరిత్రను విద్యార్థులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఫిజిక్స్ హెడ్ ఎం.సత్యవాణి, కెమిస్ట్రీ హెడ్ అల్లూరి గణపతిరాజు, ఎన్‌సిసి మేజర్ వీరయ్య పాల్గొన్నారు.

ఉగాది నాటికి ఇళ్లు పూర్తి చేసుకోవాలి

ప్రజాశక్తి - అత్తిలి

జగనన్న గృహ లబ్ధిదారులు ఉగాది నాటికి పూర్తి చేసుకోవాలని హౌసింగ్ ఇఇ బి.వి.రమణ అన్నారు. మంగళవారం అత్తిలిలోని బొంతువారిపాలెం చర్చి బ్యాక్‌సైడ్ లేఅవుట్ స్పెషల్ వెరిఫికేషన్ ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ఫోమ్ కాంక్రీట్ టెక్నాలజీతో కడుతున్న గృహాలను లబ్ధిదారులకు అనుగుణంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వివివిఎస్ రామారావు, ఇన్‌ఛార్జి హౌసింగ్ ఎఇ టి.శ్రీనివాస్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఆర్ఆర్ఆర్‌కు ఆస్కార్ రావడంపై హర్షం

ప్రజాశక్తి - ఉండి

ఎంతో ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ అవార్డు ఆస్కార్ అందుకున్న ఆర్ఆర్ఆర్ సినిమా బృందంలో ఉన్న రాహుల్ సిప్లిగంజ్‌కు ఉండి నాయీ బ్రాహ్మణ సంఘం శుభాకాంక్షలు తెలిపింది. మంగళవారం నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ అన్నమయ్య భవనంలో సంఘం సభ్యులు కేక్‌కట్ చేసి తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు మల్లవలస అప్పారావు మాట్లాడుతూ తమ కులవృత్తిని చేసుకుంటూ సినిమాల్లో పాటలు పాడి తనకంటూ ఒక స్థానం ఏర్పరుచుకుని ఇప్పుడు అంతర్జాతీయ వేదిక మీద నాటు నాటు పాట పాడటమే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో ఆస్కార్ అవార్డును అందుకున్న సినిమా బృందంలో ఉన్న రాహుల్ సిప్లిగంజ్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లవలస వీర వెంకట సత్యనారాయణ, సంఘం సభ్యులు ముత్యాలపల్లి రాంబాబు, మల్లవలస రవీంద్ర పాల్గొన్నారు.

ప్రొఫెసర్ అజహార్ అహ్మద్‌కు పిహెచ్‌డి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న మహమ్మద్ అజహార్ అహ్మద్‌కు చెన్నయ్‌లోని అన్నా యూనివర్సిటీ పిహెచ్‌డి ప్రదానం చేసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతి రాజు చెప్పారు. మంగళవారం కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అహ్మద్‌ను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మహమ్మద్ అజహార్ అహ్మద్ మాట్లాడుతూ అన్నా యూనివర్సిటీకి చెందిన డాక్టర్ కందస్వామి రాజా పర్యవేక్షణలో అప్లికేషన్స్ ఆఫ్ ఇంటిలిజెంట్ కంట్రోలర్ స్కీమ్స్ ఫర్ పవర్ జనరేషన్ అనే అంశంపై తాను చేసిన పరిశోధనకు గాను తనకు పిహెచ్‌డి వచ్చిందన్నారు. అహ్మద్‌ను కళాశాల యాజమాన్యం అభినందించారు.

కోలమూరులో రీసర్వే

ప్రజాశక్తి - ఉండి

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న శాశ్వత భూహక్కు రక్ష పథకం ఏర్పాటు చేసిందని కోలమూరు గ్రామ రెవెన్యూ అధికారి టివి అప్పలాచార్యులు అన్నారు. మంగళవారం కోలమూరు గ్రామంలో భూ రీ సర్వే కోసం డ్రోన్ ఫ్లైను నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలాచార్యులు మాట్లాడుతూ సరిహద్దు తగదాలకు స్వస్తి పలకడానికి ఈ భూ రీసర్వే ఎంతో ఉపయోగపడుతుందన్నారు. భూ రీ సర్వే కోసం అత్యాధునిక డ్రోన్లను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. ఈ డ్రోన్ ఫ్లైను గ్రామ ఉప సర్పంచి నడింపల్లి రాంబాబు రాజు, గ్రామ పెద్దలు రుద్రరాజు నరసరాజు, పద్మనాభ రాజు, చక్రవర్తి రాజు, మండల విస్తరణాధికారి అందే కొండలరావు పర్యవేక్షించారు.

25న ఎస్ఆర్‌కెఆర్‌లో స్ఫూర్తి సింపోజియం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన 'స్ఫూర్తి 23' పేరిట జాతీయస్థాయి టెక్నికల్ సింపోజియం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు చెప్పారు. దీనికి సంబంధించి పోస్టర్‌ను మంగళవారం కళాశాల మేనేజ్‌మెంట్ మీటింగ్ హాల్లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఎస్ఇ విభాగం హెడ్ డాక్టర్ వి.చంద్రశేఖర్ మాట్లాడుతూ స్ఫూర్తి సింపోజియంకు దేశం నలుమూలల నుంచి పలువురు విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకూ మూడు రోజుల పాటు అప్లికేషన్ డెవలప్మెంట్ అంశంపై వర్క్ షాప్ కూడా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈనెల 23వ తేదీన 24 గంటల పాటు నిర్విరామంగా హేక్తాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాల పాలకవర్గ సభ్యులు సాగి సత్య ప్రతీక్ వర్మ మాట్లాడుతూ సింపోజియంలో వివిధ విభాగాల విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఫాకల్టీ కోఆర్డినేటర్స్ ప్రియదర్శిని, పి.భరత్ శివవర్మ, బిఎన్‌వి నరసింహరాజు, స్టూడెంట్ కోఆర్డినేటర్స్ వైష్ణవి, బ్రెన్జోయెల్, పవన్ పుత్ర పాల్గొన్నారు.

ఐభీమవరంలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఆకివీడు

ఐ.భీమవరం గ్రామంలో మంగళవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కాలువగట్టు దగ్గర బస్టాండ్ వద్ద చలివేంద్రాన్ని గ్రామ సర్పంచి గాలి సామ్రాజ్యం ప్రారంభించారు. ఈ చలివేంద్రలో ప్రతిరోజూ మజ్జిగ పంపిణీ చేస్తామని తెలిపారు. గ్రామస్తులు, దాతల సహకారంతో చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నటుల సర్పంచి తెలిపారు. మొదటిరోజు దాత గొట్టుముక్కల వెంకట సత్యనారాయణ రాజు సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభకు తరలిన నేతలు

ప్రజాశక్తి - కాళ్ల

మచిలీపట్నంలో జరిగే జనసేన ఆవిర్భావ సభకు ఉండి నియోజకవర్గం నుంచి బస్సులు, కార్లతో వేలాదిమంది జనసేన నాయకులు, జన సైనికులు పెద్ద ఎత్తున తరలి వెళ్తున్నామని పార్టీ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తుగ నాగరాజు అన్నారు. మంగళవారం ఏలూరుపాడులో ఉప్పుటేరు వంతెన వద్ద జుత్తుగ నాగరాజు జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు ఎరుబండి రామాంజనేయులు(రాము), కోమటిగుంట గ్రామ అధ్యక్షులు పసుపులేటి మహేష్, కాళ్ల గ్రామ అధ్యక్షులు బండారు సోమేశ్వరరావు పాల్గొన్నారు.

పాలకొల్లు : జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మచిలీపట్నంలో జరుగుతున్న బహిరంగ సభకు పట్టణంలోని జన సైనికులు తరలివెళ్లారు. పట్టణం నుంచి తులా రామలింగేశ్వరరావు, శిడగం సురేంద్ర, అఖిల్, అలుగు శక్తి సురేష్ లంక కిరణ్ సాయి, బొద్దని శిరీష్, పండు, కిరణ్ అధిక సంఖ్యలో జనసైనికులు తరలివెళ్లారు.

మొగల్తూరు : జనసేన ఆవిర్భావ సభకు మండలంలోని పలు గ్రామాల నుండి అధిక సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు మంగళవారం తరలివెళ్లారు. ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన వాహనాల్లో బయలుదేరి వెళ్లారు.

గంజాయి సేవిస్తున్న ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఉల్లంపర్రు గ్రామంలో గంజాయి సేవిస్తున్న ముగ్గురిని సోమవారం రాత్రి అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పాలకొల్లు రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. వీరికి గంజాయి ఎక్కడి నుంచి వస్తుందో తెలుసుకునేందుకు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

దాళ్వాకు సాగునీటి కష్టాలు!

ఎండుతున్న వరిచేలు - రైతుల ఆందోళన

ప్రజాశక్తి - పెనుమంట్ర

దాళ్వాలో సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. వంతుల వారీ విధానంతో మండలంలో శివారు ప్రాంత వరి చేలకు సాగు నీరు అందని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాలువల్లో ఉన్న కొద్దిపాటి నీటినే మోటార్ల సాయంతో చేలను తడుపుకుంటున్నారు. రాపాక కాలువ నుండి తిల్లపూడి కాల్వ మధ్య ఉన్న ఓడూరు పరిధిలో వంతుల వారీ విధానం నడుస్తోంది. అయితే సాగునీరందక తమ పొలాలు ఎండిపోతున్నాయని చుట్టు పక్కల రైతులు ఆవేదన చెందుతున్నారు. వచ్చిన కొద్దిపాటి నీటితోనే పంటకు పెడుతున్నామని, ఇలా అయితే పంట చేతికొస్తుందో లేదో అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినా ఇరిగేషన్ అధికారులు రైతుల ఇబ్బందులను గమనించకపోవడం దురదృష్టకరమని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు సాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. ప్రతి విద్యార్థిపైనా వ్యక్తిగత శ్రద్ధ చూపుతూ ముందుకుసాగుతున్నారు. ప్రణాళికా బద్ధంగా చదివిస్తున్నారు..

నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా బోధన..



కె.సత్యనారాయణమూర్తి, కోపల్లె హైస్కూల్ హెచ్‌ఎం, కాళ్ల మండలం

పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలనే తపనతో ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తున్నారు. విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నాం. ఎప్పటికప్పుడు పైఅధికారుల సూచనలు పాటిస్తూ టిఏపి ప్రోగ్రామ్ అమలు చేస్తున్నాం. ఉదయం, సాయంత్రం తరగతులు నిర్వహిస్తున్నాం. సెలవు రోజుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. మెరిట్ విద్యార్థులతో పాటు, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాం. ఒక్కో ఉపాధ్యాయుడు పది మంది విద్యార్థులను దత్తత తీసుకుని ప్రత్యేక తరగతులు నిర్వహించి సబ్జెక్టుల వారీగా బోధన చేస్తున్నాం. తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటి వద్ద ప్రణాళికా బద్ధంగా చదివేలా సూచిస్తున్నాం

ఉత్తమ ఫలితాలకు కృషి..



గాదిరాజు సుధారాణి, ప్రధానోపాధ్యాయిని, బొండాడ హైస్కూల్, కాళ్ల మండలం

పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివితే తప్పనిసరిగా మెరుగైన ఫలితాలు సాధించొచ్చు. ఉపాధ్యాయులందరితో సమిష్టి కృషి చేస్తున్నాం. విద్యార్థుల సామర్థ్యాలను గత పరీక్షల్లో సాధించిన ఫలితాలను దృష్టిలో ఉంచుకొని గ్రేడ్లుగా విభజించి చదివిస్తున్నాం. విద్యార్థులను ఉపాధ్యాయులకు దత్తత ఇచ్చి వారు రోజూ పాఠశాలకు హాజరయ్యేలా చూస్తున్నాం. ఇంటి వద్ద ఏ విధంగా చదువుతున్నారో పర్యవేక్షిస్తున్నాం. ఫోన్ ద్వారా తల్లిదండ్రులకు సలహాలు, సూచనలు అందిస్తున్నాం. పరీక్షలు ముగిసే వరకూ టివిలకు, సెల్ ఫోన్లకు పిల్లలను దూరంగా ఉంచాలని సూచించాం.

మొగల్తూరులో లేగదూడల ప్రదర్శన

ప్రజాశక్తి - మొగల్తూరు

పాడి పశువులతో రైతులు ఆర్థికంగా నిలబడేందుకు అవకాశం ఉంటుందని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ జవార్ హుస్సేన్ అన్నారు. మొగల్తూరులోని పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. పశువుల ఆరోగ్యం తెలుసుకునేందుకు నరసాపురంలో ల్యాబ్ ఏర్పాటు చేశామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రదర్శనను సర్పంచి పదవుల మేరీ సత్యనారాయణ ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో రైతులు 24 దూడలను ఉంచారు. ఈ ప్రదర్శనలో అందంగా ఉన్న లేగ దూడలకు బహుమతులు అందించారు. ఈ ప్రదర్శనలో జగన్నాధపురానికి చెందిన సరిపల్లి సుబ్బరాజు సాయి వాల్ దూడ ప్రథమ స్థానం, రామన్నపాలెం గ్రామానికి చెందిన అయితం తాన్ చంద్ పుంగనూరు దూడ ద్వితీయ స్థానం, మొగల్తూరుకు చెందిన రావుల సత్యనారాయణ దూడ తతీయ స్థానంలో నిలిచాయి. అనంతరం బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో ఎంబిసి ఛైర్మన్ పెండ్ర వీరన్న, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్, జిల్లా పశు ఘన అభివృద్ధి అధికారి డాక్టర్ జెసూరత్నం పాల్గొన్నారు.

నులిపురుగు నివారణ మాత్రలు తప్పక వాడాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పక వాడాలని నరసాపురం సబ్‌కలెక్టర్ సూర్యతేజ కోరారు. స్థానిక బిఆర్‌ఎంవి మున్సిపల్ హైస్కూల్లో జాతీయ నులి పురుగు నిర్మూలన దినోత్సవంలో భాగంగా మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వీవర్స్ కాలనీ, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జాన్ లియో ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు, గవర్నమెంట్, ప్రయివేట్ పాఠశాలలు, కాలేజీ విద్యార్థులను కార్యక్రమంలో భాగస్వామ్యం చేశారు. ఎంఇఒ ప్రసాద్, డాక్టర్ జాన్ లియో మాట్లాడారు. అనంతరం జివిఎస్‌విఆర్‌ఎం విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. మలేరియా ఆఫీసర్ రాజ్ కుమార్, హెచ్‌వి అన్నమణి, స్కూలు హెచ్‌ఎం పెద్దిరాజు, కెళ్ల పెద్దిరాజు పాల్గొన్నారు.



ఓడూరులో పిల్లలకు మాత్రలు వేస్తున్న డాక్టర్ గంగునాయుడు

పెనుమంట్ర : 19 సంవత్సరాల్లోపు పిల్లలకు మంగళవారం నులిపురుగుల నివారణకు ఆల్‌బెండజోల్ మాత్రలను అందిస్తున్నట్లు పిహెచ్‌సి వైద్యులు తెలిపారు. పెనుమంట్ర పరిధిలో 3,915 మంది విద్యార్థులకు నులిపురుగు మాత్రలు అందించినట్లు డాక్టర్ కె.లావణ్య తెలిపారు. మార్టేరు ఆరోగ్య కేంద్రం పరిధిలో 14,860 మందికి మాత్రలు అందించినట్లు డాక్టర్ కె.కార్తీక్ తెలిపారు. ఆలమూరు పిహెచ్‌సి పరిధిలో 2,635 మంది పిల్లలకు మాత్రలు అందించినట్లు డాక్టర్ ఎంజి నాయుడు అన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, ఎఎన్‌ఎం, అంగన్వాడీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉండి : బాల బాలికల్లో నులిపురుగుల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ భాను నాయక్ అన్నారు. ఎన్ఆర్‌పి అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన నులిపురుగుల నివారణా కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ భాను నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భానునాయక్ మాట్లాడుతూ బాలబాలికల్లో నులిపురుగుల వల్ల రక్తహీనత, నీరసం వంటి ఆరోగ్యపరమైన సమస్యలు ఏర్పడతాయన్నారు. పిహెచ్‌సి వైద్యులు పంజా ధర్మతేజ మాట్లాడుతూ తమ పరిధిలో 96 శాతం మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది ఆర్.కృష్ణకుమార్, ఎఎన్‌ఎం లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి ప్రియాంక పాల్గొన్నారు.

మొగల్తూరు : నులిపురుగు నివారణకు పిల్లలందరికీ మాత్రలు వేయించాలని ఎంపిడిఒ ఆర్‌సి.ఆనంద్‌కుమార్ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. నులిపురుగు నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ఉన్నారు.

అత్తిలి : నులిపురుగు నివారణా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఇన్‌ఛార్జి ఎంఇఒ డి.శారదాజ్యోత్స్న ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మండల పరిధిలోని హైస్కూల్, పాఠశాలలో ఆల్ బెండజోల్ మాత్రలను 19 సంవత్సరాల్లోపు విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వివివి ఎస్.రామారావు పాల్గొన్నారు.

కాళ్ల : జాతీయ నులి పురుగు కార్యక్రమాన్ని మండలంలోని 75 పాఠశాలల్లో, రెండు ప్రయివేట్ కళాశాలలో, 63 అంగన్వాడీ కేంద్రాల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహించారు. 21 గ్రామాల్లో 1-19 సంవత్సరాల వయసులోపు 9,184 మంది పిల్లలు ఉన్నారు. ఇప్పటి వరకు 8541 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేశామని డాక్టర్ ఎం.గులాబ్ రాజ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు ఎఎన్‌ఎంలు ఆశ వర్కర్లు అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడు : వైద్య సిబ్బంది సూచించిన విధంగా విద్యార్థులందరూ ఆల్బెండజోల్ మందులు వాడాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.సుజాత సూచించారు. నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా దుంపగడప వివి.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.

ప్రయివేటు విద్యాసంస్థలపై నిఘా పెట్టాలి

ప్రజాశక్తి - ఉండి

రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటు విద్యాసంస్థలపై దృష్టి సారించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రయివేటు విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేసి విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని వీరిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలిపారు. మంగళవారం ఉండిలోని ఒక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉండి నియోజకవర్గం సోషల్ మీడియా అధ్యక్షులుగా జొన్నల వజ్రణ్ణను నియమించి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పుష్పరాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేట్ పాఠశాలలపై నిఘా పెట్టాలన్నారు. అధిక ఫీజులు వసూలు చేయడమే కాకుండా ఫిట్నెస్ లేని బస్సులను నడిపి ప్రమాదాలను కొని తెస్తున్నాయని విమర్శించారు. వెంటనే ఆయా పాఠశాలలపై కమిటీ వేసి విచారణ చేయాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి సంధి జయరాజు, జిల్లా అధ్యక్షులు నేతల సువర్ణ రాజు, ఉండి నియోజకవర్గం అధ్యక్షులు చిగురుపాటి రాజేష్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి నన్నేటి నాగరాజు పాల్గొన్నారు.

ఇ-పంట ముసాయిదా జాబితాలో అభ్యంతరాలుంటే సరిచేసుకోండి

పెనుమంట్ర:రైతు భరోసా కేంద్రాల్లో రబీ 2022-23 సీజన్‌కు సంబంధించి ఇ-పంట ముసాయిదా జాబితాలో రైతులకు అభ్యంతరాలుంటే సరిచేసుకోవాలని ఎఒ మద్దాల జయ దుర్గామాధురి అన్నారు. ఈ నెల 17వ తేదీ వరకూ రైతు భరోసా కేంద్రాల్లో ముసాయిదా జాబితా ఉంచుతున్నట్లు తెలిపారు. రైతులకు ఏ విధమైన అభ్యంతరాలుంటే గ్రామ వ్యవసాయ సహాయకులకు రాతపూర్వకంగా అభ్యంతరాన్ని తెలియపర్చాలని తెలిపారు. ఆయా అర్జీలను ఈ నెల 17వ తేదీ వరకూ గ్రామ వ్యవసాయ సహాయకులు స్వీకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్షీరా రామలింగేశ్వరునికి రూ.14.25 లక్షల ఆదాయం

పాలకొల్లు:పట్టణంలోని క్షీరా రామలింగేశ్వర స్వామి దేవస్థానంలోని హుండీలను మంగళవారం లెక్కించగా 105 రోజులకు రూ. 14,25,192 ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వర్థినీడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రిటైర్డ్ బ్యాంకు అధికారులు అన్నం వెంకటేశ్వరరావు, కారుమూరి సూర్య నారాయణ, సిబ్బంది నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్, ఇఒ యాళ్ల సూర్యనారాయణ, ట్రస్టీలు రెల్లి నరసింహారావు, పొత్తూరి పద్మ, నాగులుకొండ రుక్మిణి పర్యవేక్షించారు.

జనరల్ నోటీసు
మహారాజశ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో, ఒంగోలు,ప్రకాశం జిల్లా,
O.S.NO. 414/2018.

పెంట్యేల హనుమంతరావు. ... పిటీషనరు
వర్సెస్
1.విశ్వనాధుల వెంకట రవిచంద్రరావు
2.తుమ్మెద మధుసూధన్‌రాజు ..... రెస్పాండెంట్స్

To
తుమ్మెద మధుసూధన్‌రాజు, తండ్రి వెంకటరాజు, వయసు 51 సం. లు, హిందూ, భీమోలు గ్రామము, గోపులాపురం మండలం,పశ్చిమగోదావరి జిల్లా.

పై నెంబరు దావాలో వాది నైన నేను, ప్రతివాదులైన అయిన మీ పై దావా షెడ్యూలు ఆస్థిని అమ్మకము వేయుటకు అనుమతిని కోరుచూ కోర్టులో దావా దాఖలు చేయగా, నోటీసు నిమిత్తము 2వ ప్రతివాదికి కోర్టు నుంచి ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించిననూ, జారీకానందున పై కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా జారీ చేయించమని ఉత్తర్వులు ఇచ్చినందున నీకు నోటీసు నిమిత్తము తేది. 20-03-2023కి వాయిదా వేసినారు. కావున ఆరోజున ఉదయం 10-30 ని.లకు నీవు స్వయంగా కాని, అడ్వకేటు ద్వారాకాని పై కోర్టువారి ఎదుట హాజరుఅయి ఆక్షేపణలు తెలుపు కొనవలసినది లేని యెడలఆ రోజున నీ పరోక్షమునందు కేసు విచారించి, తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

ఒంగోలు
తేది:12-03-2023.

ఇట్లు
పి.యల్.పవన్ కుమార్,
అడ్వకేట్, ఒంగోలు

వేలం ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. 47/2019, O.S. 162/2015

బిట్వీన్:
మద్రిపూడి శ్రీనివాసరావు ...DHR
మరియు
కల్లపల్లి శ్రీనివాసరావు ...JDR

పై నెంబరు గ్రంధంలో JDR తాలూకు దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని డిక్రీ బాకీ వసూలు నిమిత్తం **ది. 31-3-2023 సం॥ తేదీన పగలు 10 గం॥లకు** శ్రీ కోర్టు వారు నిర్ణయించిన ధర ప్రకారం బహిరంగ వేలములో విక్రయించబడునని, కావలసినవారు పాడుకొనవచ్చునని ఇందుమూలముగా యావన్మందికీ తెలియచేయడమైనది.

షెడ్యూలు: ప॥గో॥జిల్లా (ప్రస్తుతం ఏలూరు జిల్లా) ఉంగుటూరు మండలం, చేబ్రోలు గ్రామం తాలూకు డోరు నెం. 3-1 గల 125 చ॥గ॥లలో నిర్మించిన ఆర్.సి.సి. బిల్డింగు, సర్వీసు కనెక్షను, ఇతర సౌకర్యములతో సహాకు హద్దులు.
తూర్పు: రోడ్డు. **పడమర:** దాసం నాగేశ్వరరావు.
దక్షిణం: కల్లపల్లి రాజు. **ఉత్తరం:** అబ్బిరెడ్డి ముత్యాలు.
ఈ హద్దుల మధ్య *125 చ॥గ॥లలో* నిర్మించిన ఆర్.సి.సి. డాబా సర్వమున్ను.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

కాజ నాగేశ్వరరావు, అడ్వకేట్
తాడేపల్లిగూడెం, సెల్: 9989538628

<u>దావా సమను</u>
మహారాజశ్రీ తణుకు 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోరులో
ఓ.ఎస్.నెం. 360/2022

బిట్వీన్:
సోమంచి వెంకటలక్ష్మి అనే దుగ్గిరాల వెంకటలక్ష్మి ...వాది
మరియు
సోమంచి సత్యనారాయణ వగైరా ...ప్రతివాదులు

Summons To Denfendants:
1) సోమంచి సత్యనారాయణ, తండ్రి: వెంకటేశ్వర్లు.
2) సోమంచి వెంకటనాగ సూర్యగణేష్ పవన్‌కుమార్, తండ్రి: సత్యనారాయణ.
3) సోమంచి దత్త ఫణిప్రభాకర్, తండ్రి: సత్యనారాయణ.
4) మండవల్లి సూర్యకుసుమలత, భర్త: నాగవెంకట సత్యనారాయణ మూర్తి, తండ్రి: సోమంచి సత్యనారాయణ, డో.నెం. 26-3-1/2, ఆలమూరి వీధి, తణుకు.

పై నెంబరు కేసులో మీకు ఎన్నిసార్లు సమన్లు పంపించిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కాబట్టి శ్రీ కోర్టు వారు మీకు ఈ పేపరు ద్వారా సమన్లు ఆర్డరు వేసియున్నారు. కాబట్టి మీరు **ది.24-03-2023 సం॥రం తారీఖున ఉదయం గం॥ 10:30 ని॥లకు హాజరయ్యి మీ అభ్యంతరములు తెలియజేసుకొనవలెను.** లేని ఎడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

వేదుల రామశశిధర్
తణుకు, అడ్వకేట్, తణుకు.
13-3-23. సెల్: 90301 15165

NOTICE
మహారాజశ్రీ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి, ఏలూరు
O.S. No. 353/2022

Between:
సైదు కొండబాబు మరియు ఇతరులు ***...Plaintiffs***
AND
1. బలే నాగరాజు @ ETV నాగరాజు
2. బలే శ్రీను
3. సైదు లక్ష్మీనారాయణ
4. బలే శ్రీను @ గెడ్డం శ్రీను
5. బండారు నాగ మల్లేశ్వరరావు

...Defendants

పై నెంబరు గల దావాలో Defendants 1, 2 లకు నోటీసులు అమలు నిమిత్తము ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ పుచ్చుకొనక కాలయాపన చేయుచున్నందున పై కోర్టు వారు Defendants 1 and 2 లకు నోటీసులు అమలు నిమిత్తం పేపరు పబ్లికేషన్‌కు ఆర్డరు వేసియున్నారు. **ది. 10-04-2023వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరు అయి మీ వాదనలు తెలియపరచుకోగలరు. లేనియెడల మిమ్ములను Exparte చేసి దావాను మీ పరోక్షమున తీర్మానించబడును.

నరుకుళ్ళ కృష్ణమూర్తి
నక్కా మదనమోహన నాగరాజు
మల్లిడి ప్రభాకరరెడ్డి
ఏలూరు అడ్వకేట్స్, ఏలూరు
ది.14-3-2023 సెల్: 9848107518

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AT NARASARAOPET
Dispute. No. 112 /2022

Between:
KAPIL CHITS (KOSTA) PVT. LTD.
Piduguralla Branch
Represented by its, Legal Officer. .... **Disputant**
A N D
DAS CHANDAMALA & Other .... **Opponents**

To
1. DAS CHANDAMALA, S/o. Bhujanga Rao, aged about: 29years, Occ: Post Master, R/o. 1-141, PETAVURU NEAR CSI CHURCH, KRPALEM, WEST GODAVARI,ANDHRA PRADESH.
2. MURALI KRISHNA GANJI, S/o.YESU PADAM, aged about 29 years, Occ: Fire Man, R/o. 2-201, SRI RAMA VARAM, NARASAPURAM, WEST GODAVARI,ANDHRA PRADESH.
3. VIJAYA RAJU DINCHINALA, S/o.SUBBACHARI, aged about 30 years, Occ: Police Constable-2384, R/o. 2-12, T NARASA PURAM, Sriramavaram, West Godavari,ANDHRA PRADESH.
4. SIVA KRISHNA SARAKAM, S/o.SUBHA CHARI, aged about 35 years, Occ: Fireman, R/o. 25-2/1-8/2, Forest Ooffice Road,Ameena peta Eluru, West Godavari District,ANDHRA PRADESH.
5. RAJENDRA KUMAR MUGGIRALA, S/o.PRASAD, aged about 30 years, Occ: Branch Post Master, R/o. 7-36, MALLESWARAM,ENDLAPALLI, WEST GODAVARI DT,ANDHRA PRADESH.

Whereas the Disputant has filed the above suit against you for recovery of Chit amount due and the suit was posted on 25-03-2023 Hence, you are hereby informed to appear before this court on 25-03-2023 at 10.00 A.M, either by your self or through your Council. Failing which the matter will be decided Exparte.

// BY ORDER OF THE COURT //
J.SRINIVAS REDDY,
ADVOCATE,
Guntur Dist.
NARASARAO PET,
Date: 06-03-2023

<u>వేలం ప్రకటన</u>
మహారాజశ్రీ నూజివీడు సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి. నెంబరు: **36/2016** ఇన్ ఓ.ఎస్. నెంబరు : **94/2008**

బిట్వీన్ :
నెలకుర్తి కొండలరావు
తండ్రి / కాలయ్య, నూజివీడు,
ఏలూరు జిల్లా (గతములో కృష్ణా జిల్లా) ...... డి.హెచ్.ఆర్.
మరియు
పల్నాటి శ్రీనివాసరావు
తండ్రి / పాండురంగారావు
దేవరగుంట గ్రామము, నూజివీడు మండలం,
ఏలూరు జిల్లా (గతములో కృష్ణా జిల్లా) ...... జె.డి.ఆర్.

కృష్ణా జిల్లా (గతములో ఏలూరు జిల్లా), నూజివీడు సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, నూజివీడు మండలం, దేవరగుంట గ్రామంలో ఆర్.ఎస్. నెంబరు: **133/6** లో య.**1-15** సెంట్లు పై తెలిపిన జె.డి.ఆర్ యొక్క సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములలో వుండి, యీ డిక్రీ బాకీ క్రింద జప్తు కాబడి, వేలం కావలసియున్న ఆస్థికి హద్దులు: తూర్పు: సమ్మిట నాగమణి గారి భూమి, దక్షిణం: అద్దేపల్లి నాగేశ్వరరావు గారి భూమి, పడమర: వంకాయల సత్యన్నారాయణ గారి భూమి, ఉత్తరం: డొంక.

డి.హెచ్.ఆర్. విలువ: రూ.2,00,000/-, అమీనా విలువ: రూ.3,45,000/- లు

పైన తెలిపిన ఆస్థిని శ్రీ కోర్టు వారు ది. **20-04-2023**వ తేదీన ఉదయం **10-30** ని॥కు బహిరంగ వేలము వేయుదురు. కావలసిన వారు పాడుకొనవచ్చును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)

ఇట్లు
పల్లగాని రాంబాబు
డి.హెచ్.ఆర్. తరపు న్యాయవాది
నూజివీడు